క్లుప్తంగా

నేడు కుయ్యేరులో ఎంపీ బోస్ పర్యటన

కాజులూరు: కుయ్యేరులో శుక్రవారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పర్యటించనున్నారని సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో బోస్ తదితరులు గ్రామంలోని ప్రముఖ నాయకుల, కార్యకర్తల ఇళ్లకు వెళ్తారు. వచ్చే ఎన్నికలకు వారిని సమాయత్తం చేస్తారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

కె.గంగవరం: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ జరుగుతుందని వెలుగు ఏపీఎం రఘురాం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని, అనంతరం చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు. దీనికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ హాజరవుతారని అన్నారు. ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, డ్వాక్రా మహిళలు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం: వెంటూరు 33/11 కేవీఏ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ వై.విజయానంద్ గురువారం విలేకరులకు తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు చెప్పారు. వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

రేపు శివల సబ్ స్టేషన్ పరిధిలో..

కె.గంగవరం: శివల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శివల, దంగేరు, పేకేరు, భట్లపాలిక, తాళ్లపోడు, మసకపల్లి, యర్రపోతవరం, గుడిగళ్లబాగ, బాలాంత్రం, అద్దంపల్లి, కుడుపూరు తదితర గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

నేటి నుంచి వలంటీర్లకు పురస్కారాల ప్రదానం

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వ పథకాలను అర్హుల ఇంటి వద్దకే చేర్చుతున్న వలంటీర్లకు పురస్కారాల ప్రదానం కార్యక్రమాల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు వలంటీర్లకు వందనం కార్యక్రమ షెడ్యూల్‌ను రామచంద్రపురం ఎంపీడీఓ ఎన్‌వీ రామచంద్రమూర్తి గురువారం ప్రకటించారు. ఆయా గ్రామాల్లో వలంటీర్లకు సత్కార కార్యక్రమాలకు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు. శుక్రవారం ద్రాక్షారామ-1, 2 పరిధిల్లో, హసన్‌బాద, తోటపేట, 17న కాపవరం, యనమదల, వెల్ల-1, 2 సచివాలయాల్లో సత్కార సభలు ఉంటాయన్నారు. 18న కందులపాలెం, ఉండూరు, అన్నాయిపేట, వేగాయమ్మపేట, 20న ఓదూరు, నరసాపురపుపేట, చోడవరం, ఏరుపల్లి, 21న నెలపర్తిపాడు, వెలంపాలెం, జగన్నాయకులపాలెం, తాళ్లపొలం, 22న వెంకటాయపాలెం గ్రామాల్లో కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ట్రాక్టర్ల ర్యాలీ విజయవంతం చేయండి



కోలంకలో కరపత్రాలు, గోడపత్రికలను పంచుతున్న రాజబాబు తదితరులు

కాజులూరు: రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కాజులూరులో జరుగనున్న కౌలురైతుల ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలని ఏపీ కౌలురైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. గురువారం రైతు సంఘాల నాయకులు మండలంలో పర్యటించి కరపత్రాలు, గోడ పత్రికలను పంపిణీ చేశారు. కోలంకలో రాజబాబు మాట్లాడుతూ అఖిలభారత రైతు సంఘాలు ఢిల్లీలో చేపట్టిన ఆందోళనలకు ప్రధాని మోదీ దిగొచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని, ఇది జరిగి ఏడాది గడుస్తున్నా ఒక్క డిమాండ్ కూడా అమలు కాలేదన్నారు. దీనిని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు కాజులూరు ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి ట్రాక్టర్ల ర్యాలీ చేపట్టనున్నామన్నారు. అనంతరం కార్యాలయాల వద్ద మహాధర్నాకు అఖిల భారత రైతు సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. రైతు సంఘాల నాయకులు నందికోళ్ల సత్తిబాబు, వెంకన్న, బండ ప్రసాద్, యాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలుడికి చేయూత

సఖినేటిపల్లి: అంతర్వేదికరలో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న బాలుడు సాగిరెడ్డి భాస్కర్ ఇందీవర్‌కు వసుధ ఫౌండేషన్ రూ.30 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేసింది. బాలుడి ఇంటి వద్ద ఆ చెక్కును సంస్థ నియోజకవర్గ కోఆర్డినేటర్ జంపన బుజ్జీరాజు అందించారు. భాస్కర్ పరిస్థితిని సంస్థ చైర్మన్ మంతెన వెంకట రామరాజుకు బుజ్జీరావు తెలపడంతో ఈ సాయం అందించారు.

సేవకు వందనం

- విశేష సేవలందించిన వలంటీర్లకు ప్రత్యేక గుర్తింపు
- సేవా పతకాలతో సత్కరిస్తున్న ప్రభుత్వం
- సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రల కేటగిరీల్లో పురస్కారాలు
- క్లస్టర్ పరిధిలో 2,550 మందికి అవార్డులు



వృద్ధురాలి వేలిముద్ర సేకరిస్తున్న వలంటీర్ (ఫైల్)

రాయవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందించడంలో విశేష సేవలందిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది. పేదలకు సంబంధించి ఎలాంటి తారతమ్యాలు చూపకుండా, సకాలంలో సంక్షేమాన్ని అందిస్తున్న వలంటీర్లను సత్కారాలతో గౌరవించి, ప్రోత్సహించాలని సంకల్పించింది. వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. వారికి ప్రతి నెలా గౌరవ వేతనం ఇస్తున్న ప్రభుత్వం, విశేష సేవలందిస్తున్న వారికి ప్రభుత్వం తరఫున ప్రోత్సహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా గతేడాది విశిష్ట సేవలందించిన వారికి వివిధ రకాల ప్రోత్సాహకాల కింద నగదుతో పాటు, శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు.

మండలం	సేవా మిత్ర	సేవా రత్న	సేవా వజ్ర
రాయవరం	390	05	01
రామచంద్రపురం అర్బన్	197	05	02
రామచంద్రపురం రూరల్	451	05	02
కె.గంగవరం	381	05	00
మండపేట అర్బన్	301	05	00
మండపేట రూరల్	492	05	02
కపిలేశ్వరపురం	294	05	02

భారీగా పెరిగిన నగదు బహుమతులు

మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలతో పాటు, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలున్నాయి. ఆయా మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లలో గతేడాది సేవా మిత్ర కింద ఎంపిక చేసిన వారికి రూ.10 వేలు, సేవా రత్న కింద ఎంపిక చేసిన వారికి రూ.20 వేలు, సేవా వజ్ర కింద ఎంపిక చేసిన వారికి రూ.30 వేల వంతున అందించారు. ఈ ఏడాది నగదు బహుమతిని పెంపుదల చేశారు. సేవా మిత్రకు రూ.15 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా వజ్రకు రూ.45 వేల నగదు బహుమతులను అందజేయనున్నారు. వలంటీర్లకు సంబంధించి ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ, ఇతర ప్రాంతాల్లో లబ్ధిదారులున్నా, అక్కడికీ వెళ్లి పింఛను అందించడం, సకాలంలో సేవలందించే విధానంలో సర్వేలు సత్వరమే పూర్తి చేయడం, ఆన్‌లైన్ లిస్టుల వెరిఫికేషన్, లబ్ధిదారుల జాబితా, ఇతర సేవలు, సంక్షేమ ఫలాల జాబితా తయారీలో వేగంగా స్పందించడం, ఇతర అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే వారిని ప్రభుత్వం ఈ అవార్డులకు అర్హతలను బట్టి ఎంపిక చేసింది.

షెడ్యూల్ ప్రకారం



ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులకు ఎంపికైన వారికి సత్కారం చేయనున్నాం. ఈ నెల 22వ తేదీలోగా షెడ్యూల్ ప్రకారం మండలాల వారీగా కార్యక్రమాలు నిర్వహించి అవార్డులు అందజేయనున్నాం.

– ఎ.శాంతి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, రామచంద్రపురం

క్లస్టర్ పరిధిలో ఇలా..

రామచంద్రపురం, మండపేట క్లస్టర్ పరిధిలో 2,550 మందికి సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను అందజేయనున్నారు. క్లస్టర్ పరిధిలో 2,506 సేవా మిత్ర, 35 మందికి సేవా రత్న, తొమ్మిది మందికి సేవా వజ్ర అవార్డులను అందజేయనున్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ ధ్యేయం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- కవలవారిసావరంలో గడప గడపకూ..



కవలవారిసావరంలో పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: పేదల కష్టాలు తీర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. స్థానిక 18వ వార్డు కవలవారిసావరంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరించి, ప్రజల సమస్యలను సావధానంగా విన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూర్యప్రకాశ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు మేలు జరిగిందని వివరించారు. రైతు భరోసా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, విద్యాదీవెన, గోరుముద్ద లాంటి పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. తద్వారా సమాజంలో పేదలు సుస్థిర జీవనం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్ కవల లక్ష్మీఅనసూయ, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నాయకులు పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, విత్తనాల నాగేశ్వరరావు, పలివెల సత్తిబాబు, ర్యాలి సత్యనారాయణ, కుడిపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



మండపేటలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తోట, దుర్గారాణి, పట్టాభి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం 20వ వార్డు వైఎస్సార్ కాలనీకి చెందిన 25 మంది ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న తీరు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులైనట్టు పార్టీలో చేరినవారు చెప్పారు. పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సేవ చేసేందుకు వైఎస్సార్ సీపీ ఓ మంచి వేదిక అన్నారు. పార్టీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్-షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, పట్టణ జేసీఎస్ కన్వీనర్ యారమాటి వెంకన్నబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బానీ, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, కాలనీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగరలో..

కపిలేశ్వరపురం: అంగరలోని గుడ్డిగూడేనికి చెందిన 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారంతా మండపేటలోని క్యాంపు కార్యాలయంలో గురువారం వాసంశెట్టి వాసు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో చేరారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వారితో మాట్లాడుతూ గ్రామంలో వైఎస్సార్ సీపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, యువనేత తోట పృథ్వీరాజ్, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, నాయకులు కొప్పిశెట్టి శ్రీనివాస్, సూరంపూడి చిన్నికృష్ణ, కవలరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి ఐక్యంగా పనిచేయాలి



ఇప్పనపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఇప్పనపాడులో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వం చేయలేని అనేక ప్రధాన పనులను పూర్తి చేసుకోగలిగామన్నారు. రూ.25 కోట్లతో తాపేశ్వరం-ఇప్పనపాడు రహదారిని దాదాపు పూర్తి చేశామన్నారు. రహదారి వెంబడి ఉన్న కల్వర్టుల నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధిని క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, యువనేత తోట పృథ్వీరాజ్, ఎంపీపీ ఉండమట్ల వాసు, ఎంపీటీసీ వనుం సత్యవేణి, రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు తిరుశూల శ్రీను, చిన్ని గంగాధరం, ముక్కపాటి శ్రీనివాస్, తిరుశూల అప్పారావు, లాజర్, కొప్పిరెడ్డి ప్రసాద్, చిక్కాల వీర్రాజు పాల్గొన్నారు.

సత్రంలో అదనపు అంతస్తుకు శంకుస్థాపన

బ్రాహ్మణ సత్రమైన శ్రీరామ మందిరం పైఅంతస్తు నిర్మాణానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షల అంచనా వ్యయంతో సత్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీకి బ్రాహ్మణ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వేగుళ్ల జోగేశ్వరరావు పనుల ప్రారంభ పూజ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్ శెట్టి కల్యాణి, బ్రాహ్మణ సంఘం సభ్యులు దంటు సూర్యనారాయణమూర్తి, ఏడిద సూర్యనారాయణ, శివకోటి శేష సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహిళలకు సీఎం జగన్ ఆసరా

లబ్ధిదారుల సమావేశంలో ఎమ్మెల్సీ తోట



మండపేటలో లబ్ధిదారులకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్ర చరిత్రలో పెద్ద సంఖ్యలో మహిళలకు ఆసరాగా నిలుస్తూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళాభ్యుదయానికి పాటుపడుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను సామాజిక, రాజకీయ, ఆర్థికంగా మెరుగుపరుస్తున్నారన్నారు. మండపేట పట్టణంలో గురువారం వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత సాయం పంపిణీ నిర్వహించారు. స్థానిక విజయలక్ష్మి నగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. రుణమాఫీ చేసి తమ సంఘాలను ఆర్థిక భారం నుంచి విముక్తి కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పట్టణంలో 919 స్వయం సహాయక సంఘాలకు రూ.7.47 కోట్లను చెక్కు రూపేణా అందజేశారు. ఐదేళ్లలో నాలుగు విడతలుగా రూ.29.88 కోట్ల లబ్ధిని మహిళలు పొందారన్నారు. మెప్మా విభాగంలో ఉత్తమ సేవలు అందించిన ఆర్పీలను ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి, కమిషనర్ బి.రాము, కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, యువనేత తోట పృథ్వీరాజ్, షేక్ అలీఖాన్ బాబా, ముమ్మిడివరపు బాపిరాజు, యరమాటి వెంకన్నబాబు, పెంకే గంగాధర్ పాల్గొన్నారు.

19 నుంచి వైభవ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలు మంగ, గోదాదేవీ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి నవమ బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ నిర్వాహక కమిటీ చైర్మన్ దాసర లక్ష్మణమూర్తి, కార్యదర్శి పెద్దింశెట్టి రామస్వామి, వైస్ చైర్మన్ సూరంపూడి వెంకట్రావు, మాజీ ఉప సర్పంచ్ సంకాబత్తుల స్వామికాపు తెలిపారు. 19న కల్యాణమూర్తులకు తిరుమంజన సేవ, విశేష పుష్పార్చన, విశ్వక్సేన ఆరాధన, 20న యాగశాల అర్చన, మహా సుదర్శన హోమం, కల్యాణ మహోత్సవం, 21న కొట్నాల ఉత్సవం, శ్రీచక్ర స్నాన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 20న ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు మోటిపల్లి వీవీ సత్యనారాయణమూర్తి, వాసా కోటేశ్వరరావు, వెల్ల శ్రీనివాస్ తెలిపారు.

భీమేశ్వరుని హుండీల ఆదాయం లెక్కింపు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయంలో హుండీల ద్వారా రూ. 15,77,588 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు గురువారం విలేకరులకు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 14 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ వరకూ హుండీల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జి.బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేగాయమ్మపేట జమీందారు వాడ్రేవు సుందర రత్నాకరరావు, కంచెర్ల చక్రధరరావు (చక్రి), అర్చకులు, పురోహితులు, సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కె.గంగవరం: కోటిపల్లి గ్రామంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను), లయన్స్‌క్లబ్ కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ వైద్యశాల సిబ్బంది రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసేందుకు నేత్ర వైద్యశాలకు పంపించారు. సర్పంచ్ పెమ్మాడి బేబీసత్తిబాబు, పి.సాయిబాబా, వై.వీరభద్రరావు, వై.బాలాజీ పాల్గొన్నారు.

ద్రాక్షారామలో హజరత్ అబ్బాస్ గంధోత్సవం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ముస్లింలు మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ అబ్బాస్ జయంతిని పురస్కరించుకుని గంధోత్సవం నిర్వహించారు. ఓడలో గంధం, ప్రసాదం ఉంచి ద్రాక్షారామ చాంద్ పంజా వీధిలో ఊరేగించారు. భక్తులకు గంధాన్ని నుదిటిపై అలంకరించారు. అన్నదానం చేశారు. మీర్జా ఖాసిం సాహెబ్, మత గురువు మీర్జా అస్కరి హుస్సేన్ ఫాతేహా కార్యక్రమం నిర్వహించారు. ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభాత భానుడికి ప్రణామం

సూర్యుడితోనే సృష్టి ముడిపడి ఉంది. జీవకోటి మనుగడ సాగించాలంటే భానుడి కరుణా కటాక్షం ఉండాల్సిందే. రేచీకట్లను చీల్చుకుని.. వెలుగు కిరణాలను ప్రసరిస్తూ ఉదయించే సూరీడిని నిత్యం ఆరాధించడం భక్తులకు పరిపాటే. ఈ నేపథ్యంలోనే సప్తాశ్వధారుడైన ప్రభాతుడిని రథసప్తమి పర్వదినాన విశేషంగా పూజించేందుకు భక్తులు సంసిద్ధులయ్యారు.

- ఆధ్యాత్మికం, ఆరోగ్యం కలగలుపు వేడుక
- విశిష్ట ప్రాధాన్యమున్న రథ సప్తమి నేడే..
- రెండు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో సందడి



సూర్య నమస్కారాల చిత్రాలు

కపిలేశ్వరపురం/రాయవరం: సుషుమ్న, హరికేశం, విశ్వకర్మ, విశ్వవ్యచ, సంపద్వసు, అర్వాగ్వసు, స్వరాడ్వసు అనే సప్త రశ్ములున్న సూర్యుడిని సప్తమినాడు పూజించే ప్రక్రియే రథ సప్తమి. ఈశ్వరుడి సృష్టిలోని నవగ్రహాల్లో ప్రముఖుడైన, మాఘశుద్ధ సప్తమినాడు జన్మించిన సూర్య భగవానుడికి పూజలు చేసే ఆధ్యాత్మిక కార్యక్రమమే రథసప్తమి. శుక్రవారం రథ సప్తమి సందర్భంగా ఈ కథనం.

రథ సప్తమి ప్రాధాన్యమిదే..

సూర్య భగవానుడి జన్మ తిథి మాఘశుద్ధ సప్తమిని పురస్కరించుకుని భక్తులు రథ సప్తమిని జరుపుకొంటారు. వైష్ణవాలయాలతో పాటు, ప్రతి ఇంటిలో సూర్యభాస్కరుడిని పూజలతో తరిస్తారు. చిక్కుడు కాయలు, కొబ్బరి ఈనెలతో తయారు చేసిన రథానికి, చిక్కుడు ఆకులు, రేగు పండ్లు, జిల్లేడు పూలతో అలంకరించి పూజిస్తారు. ఆవు పిడకలతో ఏర్పాటు చేసిన దాలిపై, ఆవుపాలు పొంగించి తయారు చేసిన క్షీరాన్నంతో పాటు, చెరుకు, తెల్ల దుంపలను భాస్కరునికి నైవేద్యంగా సమర్పిస్తారు. మహిళలు ఉదయాన్నే రేగుపండ్లు, జిల్లేడు ఆకులు శిరస్సుపై ధరించి, పుణ్యస్నానాలాచరిస్తారు. తెల్లవారుజామున భక్తులు సూర్య నమస్కారాలు చేస్తారు. ప్రముఖ ఆలయాల్లో అదే రోజు సూర్యప్రభ వాహనం, చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై స్వామిని ఊరేగించి, మధ్యాహ్నం స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తారు.



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

రథసప్తమి రోజున పుణ్య గౌతమి గోదావరి తీర ప్రాంతాలైన కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి పుష్కర ఘాట్లు మహిళలతో కిటకిటలాడతాయి. ఇతర గ్రామాల వైష్ణవాలను భక్తులు సందర్శిస్తారు. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠంలో అరుణహోమాన్ని, సూర్య నమస్కారాలను ప్రదర్శిస్తారు. సామూహిక కుంకుమ పూజలు చేస్తారు. అంగరలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి పూజలు చేస్తారు. ఏడిదలోని సంగమేశ్వర క్షేత్రంలో సూర్యనారాయణస్వామికి పంచామృతం, మందార పువ్వులతో పూజలు జరుపుతారు. రెండు నియోజకవర్గాలకు సమీపాన ఉన్న పెదపూడి మండలం జి.మామిడాడలో ఏటా జరిగే సూర్యనారాయణస్వామి రథోత్సవానికి ఇక్కడి భక్తులు తరలివెళ్తారు.



రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

ఆరోగ్య సిద్ధికి సూర్య నమస్కారాలు

సూర్య నమస్కారాల్లోని పదకొండు ఆసనాల్లో ఆరోగ్య, ఆధ్యాత్మిక అంశాలు ఒదిగి ఉంటాయి. వాటిని చేయడం ద్వారా కదలికలు ఏర్పడి, శరీరావయవాల్లోని భాగాలకు రక్త ప్రసరణ వృద్ధి చెందుతుంది.

- ప్రణామాసనంతో ఏకాగ్రత పెరుగుతుంది.
- హస్త ఉత్థానాసనంతో ఊపిరితిత్తులు శుభ్రమవుతాయి. అధిక బరువును తగ్గిస్తుంది.
- హస్తపాదాసనంతో ఉదర భాగంలో కొవ్వు కరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
- ఏకపాద ప్రసారణాసనం ద్వారా నాడీ మండల వ్యవస్థను ఉత్తేజితమై, ఉదరావాస సామర్థ్యం పెంచుతుంది.
- దండాసనం ద్వారా కాళ్లు, చేతులు, భుజాల కండరాలు బలిష్టంగా మారి, శరీరం సమతుల్యం చెందుతుంది.
- అష్టాంగాసనం గుండె పనితీరును మెరుగుపరుస్తుంది.
- భుజంగాసనంతో వెన్నునొప్పి, ఉబ్బసం, సెర్వికల్ స్పాండిలోసిస్ నుంచి ఉపశమనం కలుగుతుంది.
- పర్వతాసనం నడుం చుట్టూ ఉండే కొవ్వును కరిగిస్తుంది. మిగిలిన అశ్వ సంచలనాసనం, హస్త పాదాసనం, హస్త ఉత్థానాసనం, ప్రణామాసనాలు తిరిగి చేస్తారు.

ప్రయోజనాలెన్నో..



యోగాలో భాగమైన సూర్య నమస్కారాలను ప్రతిఙక్కరూ ఆచరించాలి. 12 రకాల సూర్య నమస్కారాలను ఉదయం సూర్యోదయ సమయంలో చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. శరీరం, మనసు అనువైన విధంగా వంగి కండరాల పటిష్టత కలుగుతుంది.

– వెలగల ఫణికృష్ణారెడ్డి, యోగా గురువు, రాయవరం

శుభకరం.. సుదినం



రవి కటాక్షాన్ని పొందే పవిత్రదినమే రథ సప్తమి. రథం ముగ్గు వేసి, కొబ్బరి పిందెలు, కొబ్బరి ఈనెలతో రథం చేస్తారు. రథాన్ని చిక్కుడు పువ్వులతో అలంకరిస్తారు. ఆవు పిడకలపై ఆవు పాలతో పొంగలి చేసి సూర్య భగవానుడికి నైవేద్యంగా చెల్లిస్తారు. ఇది ఎంతో శుభకరం.

– పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, పురోహితుడు, సోమేశ్వరం